సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



'పవర్'ఫుల్ టెక్నాలజీ

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది ఏపీఈపీడీసీఎల్. విద్యుత్ సరఫరాలో సమస్యలను అధిగమిస్తోంది. 8లో



సచివాలయాలు ఆదర్శం

దేశంలో సచివాలయ వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు అన్నారు. 8లో



ఎస్సై పరీక్షా కేంద్రాల పరిశీలన

ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఎస్సై రాత పరీక్షా కేంద్రాలను విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం పరిశీలించారు. 8లో

న్యూస్‌రీల్

ఖైదీల్లో పరివర్తన రావాలి



ఖైదీకి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీల్లో పరివర్తన రావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆకాంక్షించారు. విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు నాటికలు, వక్తృత్వం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ, జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు పి.ఎస్.రామచంద్రరావు, ఎస్.కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి సన్నిధిలో వేదప్రకాష్ దంపతులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వేదప్రకాష్ సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆయన అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ప్రసాదాన్ని అందజేశారు.

నేటి నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర సమాచార శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం నుంచి 3 రోజుల పాటు విశాఖలో పర్యటించనుంది. కమిటీ చైర్‌పర్సన్ ప్రతాప్‌రావ్ జాదవ్ అధ్యక్షతన 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన బృందం మంగళవారం నగరానికి చేరుకోనుంది. పర్యటనలో భాగంగా బీఎస్ఎన్ఎల్, రైల్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఎక్సాకామ్, రిలయన్స్, జియో సంస్థల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ పథకం కింద ఆయా సంస్థలు అమలు చేస్తున్న వ్యూహాల గురించి సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ(మైటీ), హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ టెస్ట్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి



వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి సూచించారు. సోమవారం జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలను జూ క్యూరేటర్ నందనీ సలారియాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8 వరకు జరగనున్న ఈ వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో సీపీఈ జూనియర్ కళాశాల ప్రతినిధులు, సిబ్బంది ఇక్కడ జంతువుల సంరక్షణ కోసం రూ.40 వేల చెక్కును సీసీఎఫ్‌కు అందజేశారు. ఆయా చిన్నారులు వేసిన చిత్రాలను ప్రదర్శించారు.

నేడు 7 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం ఏడు ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ఇసుకతోట యూపీహెచ్‌సీలో, పెదగంట్యాడ కాపుతుంగ్లాంలో, మధురవాడ వాంబే కాలనీలో, పెందుర్తి గుర్రంపాలెంలో, ఆనందపురం మండలంలోని లోడగలవానిపాలెంలో, రేవడి-పద్మనాభంలో గంధవరంలో, భీమిలి పరిధిలో టి.నగరపాలెంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

విత్తన బంతి.. హరిత కాంతి



కొండలపై హెలికాప్టర్ల ద్వారా విత్తన బంతులు చల్లిన జీవీఎంసీ

దాబాగార్డెన్స్: అడవులు సహజ సిద్ధంగా తయారు కావాలి. గుంతలు తవ్వి, మొక్కలు నాటి అడవులు సృష్టించడం అసాధ్యం. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అడవి జీవవైవిధ్యానికి అద్దం పడుతుంది. ఇలాంటి అడవులను సృష్టించేందుకు జీవీఎంసీ కృషి చేస్తోంది. ఒకవైపు మొక్కలు నాటుతూనే మరోవైపు నగరంలో ఏడు కొండలపై సీడ్ బాల్స్ విడుదల చేసే కార్యక్రమానికి ఈస్టర్న్ నేవల్ కమాండ్, గ్రీన్ క్లైమేట్ సంస్థ సహకారంతో జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఐఎన్ఎస్ డేగా వద్ద నేవల్ అధికారి మనీష్‌శర్మతో కలిసి మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. 4 హెలికాప్టర్ల ద్వారా సుమారు 6 లక్షల విత్తనాలను సేకరించి నగరంలోని పావురాల కొండ 1, 2, కాపులుప్పాడ, సింహాచలం, పార్లపాలెం కొండ, వేదుళ్లనరవ కొండ, యారాడ కొండలపై విడుదల చేసినట్లు మేయర్ తెలిపారు. విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, హార్టికల్చర్ డీడీ దామోదర్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, నేవల్ అధికారులు, గ్రీన్‌క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం పాల్గొన్నారు.



నేవీ సిబ్బందికి విత్తన బంతులు అందజేస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, నేవల్ అధికారి మనీష్‌శర్మ తదితరులు



కొండలపై విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న నాలుగు హెలికాప్టర్లు

బండారు.. ఖబడ్దార్



నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మహిళలు

- నోరు అదుపులో పెట్టుకో.. ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలపై పెందుర్తి కూడలిలో నిరసన

సింహాచలం: రాష్ట్ర మంత్రి ఆర్.కె. రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. పెందుర్తి నియోజకవర్గ మహిళా నేతలు పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ బండారు ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని గుర్తుంచుకోవాలన్నారు. బండారు నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాజకీయ విమర్శలు ఎన్నైనా చేసుకోవచ్చని, మహిళలపై నీచమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మహిళలంటే గౌరవం లేకుండా బండారు ప్రవర్తిస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టిలో పడేందుకు ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేశారన్నారు. టీడీపీకి, చంద్రబాబుకు కూడా మహిళలంటే గౌరవం లేదన్నారు. ఆడపిల్ల పుట్టుకనే చులకన చేసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి చంద్రబాబు వద్ద బండారు పనిచేస్తున్నారన్నారు. జెర్రిపోతులపాలెంలో మహిళపై జరిగిన దాడి విషయంలో ఆరోజే బండారుని ఇంట్లో ఆడవాళ్లు కొట్టి ఉంటే ఈరోజు ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ బండారు సత్యనారాయణ పెందుర్తి నియోజకవర్గ పరువు తీశారన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగువాళ్లంతా ఈరోజు బండారును అసహ్యించుకుంటున్నారన్నారు. ఇరవై ఏళ్లు శాసనసభ్యుడుగా పనిచేశానని చెప్పుకునే బండారు సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్, మహిళా తహసీల్దార్ జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చిన సంఘటనలు టీడీపీ పాలనలో చూశామన్నారు. మహిళలకు ఉన్నతస్థితి కల్పించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. దళిత మహిళను హోంమంత్రిగా చేశారన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే పెందుర్తి నియోజకవర్గ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి ఎంపీపీ నాగమణి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నక్క నూకరాజు, నాయకులు దేవిసాంబ, శరగడం నరసింహమూర్తి, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై స్పెషల్ ప్రోగ్రామ్



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్



ప్లకార్డులతో ప్రచారం చేసే సిబ్బందితో ఈపీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు, ఎస్ఈలు

- ఈపీడీసీఎల్ పరిధిలో ప్రతి నెలా 2వ తేదీన నిర్వహించేందుకు ప్రణాళిక
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార రథం
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు ప్రమాదాలను అరికట్టేందుకు విద్యుత్ భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమాలను గాంధీ జయంతి పురస్కరించుకొని ఇకపై ప్రతినెలా 2వ తేదీన క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రకటించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎండీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ భద్రత అవగాహన రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సంస్థ సిబ్బందితో క్షేత్రస్థాయి నుంచి అధికారుల వరకు ప్రతీ ఒక్కరూ భద్రతాసూచనలను తప్పకుండా ఆచరిస్తామని విశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని ఇందులో భాగంగా సంస్థ పరిధిలోని ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలోని 11 జిల్లాల వినియోగదారులకు, సిబ్బందికి విడివిడిగా భద్రతా సూచనలు తయారుచేశామన్నారు. ప్రచార రథంతో అవగాహన కల్పించడంతో పాటు భవన నిర్మాణ కార్మికులు, తోటల యజమానులు, రైతు కూలీలు, వాహనాల డ్రైవర్లకు ప్రత్యేకంగా సూచనలను రూపొందించినట్లు వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1912 కు ఫోన్ చేయాలని సూచించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ భద్రత సూచనలకు సంబంధించిన ఆడియోలను తయారు చేసి సంస్థ పరిధిలోని అన్ని సెక్షన్ కార్యాలయాలకు పంపించినట్లు వివరించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, ఏవీవీ సూర్యప్రతాప్, సీజీఎంలు, ఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో వైద్య నిపుణులచే సేవలు

- రెండో పీహెచ్‌సీలో తప్పనిసరిగా మహిళా డాక్టర్ నియామకం
- ఆయుర్వేద వైద్యాన్ని విస్తరించడానికి ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున

ఆనందపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడానికి సుమారు ఐదు వేల మంది వైద్య నిపుణులను వినియోగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సోమవారం మండలంలోని శొంఠ్యాంలో రూ.6.67 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను ఇంటి వద్దే అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందుగా రోగులను గుర్తించడం ప్రత్యేక వైద్య శిబిరాలు ద్వారా వారికి చికిత్సలు అందించడం వంటి మహత్తర కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. వైద్య సిబ్బంది రోగులను జల్లెడ పట్టి సేవలు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు విద్యార్థులకు వైద్య విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే సారి 15 వైద్య కళాశాలలను మంజూరు చేయగా అందులో ఇప్పటికే 5 కళాశాలలను ప్రారంభించామని చెప్పారు.

ఆయుర్వేద వైద్యం విస్తరణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో యునానీ వైద్యంతో పాటు ఆయుర్వేద వైద్యాన్ని విస్తరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. శొంఠ్యాంలో ఏర్పాటు చేస్తున్న ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ కేంద్రంలో తయారైన మందులను ఇక్కడే తనిఖీ చేసి రాష్ట్రంలో గల అన్ని ఆయుర్వేద వైద్యంలో అందజేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల సుమారు 150 మందికి ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 70 వైద్య శిబిరాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. శొంఠ్యాంలో రెండో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే కొంతమంది కోర్టు ద్వారా ఆటంకాలు కల్పించడం మంచిదికాదన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం ఆర్‌డీడీ వై.శేఖర్, మూడు జిల్లాల పార్టీ యూత్ విభాగం కో-ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీస్, ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, లెంక రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పల్ల దుర్గ, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు కోరాడ వెంకటరమణారావు, పాండ్రంకి అప్పారావు, కోరాడ అప్పలస్వామి నాయుడు, బిఆర్‌బి నాయుడు పాల్గొన్నారు.

ఏపీలో బాపూజీ కలలు కన్న 'గ్రామ స్వరాజ్యం'

- గ్రామ,వార్డు సచివాలయాలతో అభివృద్ధి
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి



మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

సాక్షి, విశాఖపట్నం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కొనియాడారు. మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేశారన్నారు. సోమవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి బాలరాజుతో కలిసి గాంధీ, బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు బాసటగా.. రైతులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆదర్శవంతంగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బాబిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పీలా ఉమారాణి, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, వివిధ కార్పొరేషన్ చైర్‌పర్సన్లు పిల్లా సుజాత, పిల్లి సుజాత, మాధవి వర్మ, రాష్ట్ర అదనపు కార్యదర్శి పేర్ల విజయ్‌చందర్, కృష్ణంరాజు, జోనల్ అనుబంధ కమిటీ ఇన్‌చార్జ్ తుళ్ళి చంద్ర శేఖర్, అల్లంపల్లి రాజబాబు, వంకాయల మారుతీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శులు జగ్గపల్లి అప్పలరాజు, రోజారాణి, అనుబంధ విభాగాల అధ్యక్షులు కృపా జ్యోతి, బోని శివరామకృష్ణ, ఈశ్వరరావు, పెంద్ర అప్పన్న, భయ్యపు రాధ, లక్ష్మణ్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామన్న పాత్రుడు, యువశ్రీ , రాములు అప్పుడు, శ్రీలక్ష్మి, శ్యామల, కార్పొరేటర్లు సరిపల్లి గోవింద్, బిపిన్ కుమార్ జైన్, శశికళ తదితరులు పాల్గొన్నారు.



జాతిపితకు నివాళి

కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి కలెక్టర్ మల్లికార్జున పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కె.మోహన్‌కుమార్,ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, ఎస్‌డీసీ లక్ష్మారెడ్డి, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. - మహారాణిపేట



సెంట్రల్ పార్కులో గాంధీ విగ్రహం వద్ద మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు స్టాలిన్, భీశెట్టి వసంతలక్ష్మి, బిపిన్ కుమార్ జైన్, నివాళులర్పించారు. - సీతమ్మధార



పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీ రవిశంకర్, డీసీపీలు శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, ఎస్‌బీ ఏడీసీపీ నాగేంద్రుడు తదితరులు. -అల్లిపురం

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్టమైన నిఘా



సింహగిరిపై ఎస్‌పీఎఫ్ రాజమండ్రి జోన్ కమాండెంట్ కె.ఎన్.రావు

దొండపర్తి: రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం సుశిక్షితులైన సాయుధ దళాలతో నిరంతరం పటిష్టమైన నిఘాతో సేవలందిస్తోందని రాజమండ్రి జోన్ కమాండెంట్ డాక్టర్ కె.ఎన్.రావు తెలిపారు. సోమవారం విశాఖలో పర్యటించిన ఆయన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి తమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న నాల్కోను సందర్శించారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చోరీలు, విధ్వంసాలు జరగకుండా 136 మంది సాయుధ దళం సిబ్బంది అనుక్షణం ప్రభుత్వ ఆస్తులకు గస్తీ కాస్తున్నట్లు వెల్లడించారు. రాజమండ్రి జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఎస్పీఎఫ్ భద్రతలో ఉన్న అన్ని ప్రాంతాలను పరిశీలించి ఆస్తుల సంరక్షణ కోసం భద్రతాపరంగా సాయుధ దళాలకు మరిన్ని సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఇన్‌స్పెక్టర్ జి.మహేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీలతో విశాఖ ఖ్యాతి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సీతమ్మధార : దేశంలోనే క్రీడా హబ్‌గా విశాఖ మారుతోందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల బ్రోచర్‌ను ఆయన సోమవారం ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే, కిక్ బాక్సింగ్ పోటీలు నిత్యం విశాఖలో జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు కూడా జరిగే ఏర్పాట్లు చేయాలన్నారు. చాంపియన్ షిప్ చీఫ్ డైరెక్టర్, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ విశాఖలో అంతర్జాతీయ పోటీలు జరగడం గర్వకారణమన్నారు. ప్రతి నియోజక వర్గంలో ఒక స్టేడియం నిర్మిస్తామని వివరించారు. చాంపియన్ షిప్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని కోరారు. 19వ డబ్ల్యూకే అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలు అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో నవంబర్ 24 నుంచి 26 వరకు జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో టోర్నీ వైస్ చైర్మన్ కేఎస్ఆర్, నరసింహరావు, పేడాడ రమణికుమారి, నిర్వాహకులు బోహత సురేష్, అల్లు శంకరావు, కరాటే కోచ్‌లు, క్రీడకారులు పాల్గొన్నారు.

ఎస్సై పరీక్షా కేంద్రాల పరిశీలన

బీచ్‌రోడ్డు: ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఎస్సై రాత పరీక్షా కేంద్రాలను విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం పరిశీలించారు. చిన్నవాల్తేరు కొటక్ స్కూల్, గాయత్రీ కళాశాల, ప్రిజం కాలేజ్, కృష్ణ కళాశాలలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీసీపీ-1 శ్రీనివాస్, మూడో పట్టణ సీఐ రామారావు ఉన్నారు.

‘పవర్’ఫుల్ టెక్నాలజీ

- కరెంట్ పోతే.. క్షణాల్లోనే పునరుద్ధరణ
- ఆటోమేటిక్‌గా ఫీడర్ చేంజ్ చేసే సాంకేతికత
- ఈపీడీసీఎల్ పరిధిలో తొలిసారిగా అమలు
- సప్లై నిలిచిపోతే గతంలో 10 నిమిషాల సమయం
- ప్రోగ్రామింగ్ ద్వారా ఇప్పుడు 90 సెకెన్లలోనే ఫీడర్ మార్పు
- అవుటర్ హార్బర్‌లోని 33కేవీ సబ్ స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం : ఆధునిక సాంకేతికత అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. ఇదే విధానాన్ని అందిపుచ్చుకుంటోంది ఏపీఈపీడీసీఎల్. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను అధిగమించడంతో పాటు పని విధానాన్ని సులభం చేసుకుంటోంది. విద్యుత్ సరఫరాకు నూతన సాంకేతికను జతచేస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు సరఫరా నిలుపుదల అంతరాయాన్ని తగ్గించేలా ఆటోమేషన్‌స్‌పరిజ్ఞానంతో సబ్ స్టేషన్ల నిర్వహణను సులభతరం చేసుకుంటోంది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో తొలిసారిగా మానవ తప్పిదాలకు ఆస్కారం లేకుండా నిమిషాల వ్యవధిలోనూ సరఫరా పునరుద్ధరించేలా అవుటర్ హార్బర్‌లో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌గా మార్చి పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా నిర్వహిస్తోంది.

విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ, ప్రసార నష్టాలను తగ్గించడంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న ఏపీఈపీడీసీఎల్ వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే విషయంలో రాజీ పడటం లేదు. ఇందులో భాగంగానే.. సబ్‌స్టేషన్ల ఆటో అప్‌డేషన్‌పై దృష్టిసారించింది. పైలెట్ ప్రాజెక్టుగా విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని అవుటర్ హార్బర్ సమీపంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఎంపిక చేశారు. ఎస్ఈ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈ ఉదయ్‌కిరణ్ బృందం ఈ పనికి ఉపక్రమించింది.

ఏం జరుగుతుందంటే.?

ఇన్నాళ్లూ ఇక్కడ ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు 132 కేవీ సబ్ స్టేషన్ ఫీడర్ ద్వారా సప్‌లై వస్తోంది. ఏదైనా సమస్య తలెత్తి.. ట్రిప్ అయితే రెండో 33/11 కేవీ సబ్ స్టేషన్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుంటారు. ఇన్నాళ్లూ విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే ఇద్దరు వ్యక్తులు ఆ సబ్‌స్టేషన్‌ను ర్యాక్ అవుట్ చేయడం, రెండో ఫీడర్ వద్దకు వెళ్లి సప్‌లై చేంజ్ చేయడం ఆ తర్వాత తిరిగి మళ్లీ సబ్ స్టేషన్ ఆన్ చేసి.. సరఫరా పునరుద్ధరణ చేసేవాళ్లు. దీనికి 5 నుంచి 10 నిమిషాల సమయం పట్టేది. ప్రోగ్రామింగ్ డిజైన్ చేయడం వల్ల ఒక ఫీడర్‌లో సరఫరా ఆగిపోతే మరో ఫీడర్‌ను అనుసంధానించేందుకు మానవ సహకారం లేకుండా.. కేవలం 60 నుంచి 90 సెకెన్ల వ్యవధిలోనే జరిగిపోతుంది. అంటే ఈ సబ్ స్టేషన్ పరిధిలో ట్రిప్ అయి కరెంట్ పోతే కేవలం 90 సెకన్లలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో 9 వేల మంది హెచ్‌టీ, ఎల్‌టీ వినియోగదారులతో పాటు, రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నాలుగు 11కేవీ ఫీడర్లు ఉన్నాయి. ఆటోమేటెడ్ అప్‌డేషన్ వల్ల 9 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా మరింత నాణ్యంగా అందుతోంది.

రూపాయి ఖర్చు లేకుండా..

నెల రోజుల వ్యవధిలోనే సాధారణ సబ్‌స్టేషన్‌ను ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌గా ఇంజినీరింగ్ అధికారులు తీర్చిదిద్దారు. ఉన్న వనరులను వినియోగించుకుంటూ రూపాయి ఖర్చు చేయకుండా టెక్నాలజీ సాయంతో సబ్‌స్టేషన్ పనితీరుని పూర్తిగా మార్చేశారు. ప్రోగ్రామింగ్ డిజైన్ చేసి ఫీడర్‌ను ఆటోమేటిక్ మార్చేలా వ్యవస్థను రూపొందించారు.

ప్రమాదాలు తలెత్తకుండా..

33 కేవీ ట్రిప్ అయితే రెండో ఫీడర్ నుంచి సప్‌లై తీసుకున్న సమయంలో ఒకేసారి సరఫరా ఎక్కువైతే ఫీడర్ల వద్ద ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే ఒక సప్‌లై తీసుకున్నప్పుడు 11 కేవీ ఫీడర్‌ను కూడా ట్రిప్ చేసేలా డిజైన్ చేశారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశమే లేదు. రెండో ఫీడర్ నుంచి సప్‌లై తీసుకున్నప్పుడు సరఫరా పునరుద్ధరణ చేసిన సమయంలో పాత ఫీడర్‌కు వెంటనే మార్చకుండా సంయమనం పాటిస్తారు. ఎందుకంటే ఈ ఫీడర్ మార్చేందుకు కనీసం నిమిషం నుంచి 2 నిమిషాల సమయం పడుతుంది. దీని వల్ల వెంటవెంటనే పవర్ కట్ అయ్యిందనే విమర్శలు వినియోగదారుల నుంచి వస్తుంటాయి. ఇది తలెత్తకుండా జాగ్రత్త వహిస్తున్నారు.


అవుటర్ హార్బర్ సబ్‌స్టేషన్


ఆటోమేటిక్ ఫీడర్ చేంజ్ రూమ్

అక్కడా ఇబ్బంది తలెత్తితే..?

సాంకేతికత సహకారంతో ఫీడర్ చేంజింగ్ నిర్వహిస్తుంటారు. ఒకవేళ ఈ టెక్నాలజీలో ఏదైనా సమస్య తలెత్తితే దానిని కూడా అధిగమించేలా వ్యవస్థను ఇంజినీర్లు రూపొందించారు. ఈ టెక్నాలజీని స్కాడాకు అనుసంధానం చేశారు. మొత్తం వ్యవస్థను స్కాడా కంట్రోల్‌రూమ్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్లు పర్యవేక్షిస్తుంటారు. ప్రోగ్రామింగ్ లాజిక్‌లో పొరపాటు జరిగి నిలిచిపోతే స్కాడాలో అలెర్ట్ చూపిస్తుంది. దీన్ని గమనించి అక్కడి నుంచే ఫీడర్‌ను నిమిషంన్నర వ్యవధిలో మార్చవచ్చు.

సీఎండీ సహకారంతో మిగతా సబ్‌స్టేషన్లలోనూ..

సీఎండీ మార్గదర్శకాలను అనుసరించి ఆటోమేషన్ సబ్‌స్టేషన్ నిర్వహణ విజయవంతంగా చేపట్టాం. దీనివల్ల సిబ్బంది వినియోగం తగ్గుతుంది. వారిని ఇతర పనులకు వినియోగించుకోవచ్చు. పనిభారం కూడా తగ్గుతుంది. వినియోగదారులకు సరఫరా లోపాల సమయం కూడా తగ్గింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చాం. అందుకే ఇక్కడ పైలట్ ప్రాజెక్టును చేపట్టాం. నగరంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన ప్రాంతాల్లో ఉన్న సబ్‌స్టేషన్‌లలోనూ ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సీఎండీ సలహాలు తీసుకుంటున్నాం. త్వరలోనే విశాఖ సర్కిల్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లలోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తాం.



– ఎల్. మహేంద్రనాథ్, ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

విశాఖలో ఎన్ఐఏ సోదాల కలకలం

- జిల్లాలో మూడు చోట్ల హక్కుల సంఘం, ఉద్యమకారుల ఇళ్లలో తనిఖీలు
- మాజీ మావోయిస్టు లక్ష్మణరావును విచారించిన అధికారులు
- ఎంవీపీలో హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధి సుధ, పీఎంపాలెంలో కేఎన్‌పీఎస్ ప్రతినిధి పాపినాయుడు నివాసాల్లో సోదాలు

దొండపర్తి: విశాఖ జిల్లాలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) సోదాలు కలకలం రేపుతున్నాయి. మావోయిస్టు సంఘాలతో సంబంధాలకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో 62 ప్రాంతాల్లో పౌర హక్కుల నేతలు, అమర బంధు మిత్రుల సంఘం నాయకుల ఇళ్లలో ఎన్ఐఏ అధికారులు సోమవారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించారు. పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు వి.ఆర్.లక్ష్మణరావును విచారించగా, ఎంవీపీ కాలనీలో మానవ హక్కుల సంఘం ప్రతినిధి కె.సుధ, పీఎంపాలెం ప్రాంతంలో కులనిర్మూలన పోరాట సమితి సభ్యుడు కురిటి పాపినాయుడు నివాసాల్లో సోదాలు చేశారు. పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందిన అమర బంధుమిత్రుల సంఘం(ఏబీఎంఎస్) సభ్యుడు వి.ఆర్.లక్ష్మణరావు 23 ఏళ్ల క్రితమే జనజీవన స్రవంతిలో కలిశారు. వాస్తవానికి లక్ష్మణరావు, అర్జునమ్మ దంపతులు విజయవాడకు చెందిన వారు. వీరి ముగ్గురు సంతానంలో రెండో కుమార్తె మినహా.. మిగిలిన వారంతా మావోయిస్టు ఉద్యమంలో పని చేశారు. చాలా కాలం పాటు మావో పార్టీలో పనిచేసిన లక్ష్మణరావు లొంగిపోయిన తరువాత తన మకాం విజయవాడ నుంచి విశాఖ జిల్లా పెందుర్తి మండలానికి మార్చారు. ఇతని పెద్దకుమార్తె పెద్దకుమార్తె చైతన్య అలియాస్ అరుణక్క ఒడిశా మావోయిస్టు దళంలో కీలకంగా పనిచేసి ఒడిశాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. రెండో కుమార్తె ఝాన్సీ న్యాయవాదిగా ఉన్నారు. హిందూజా పవర్ ప్లాంట్, గంగవరం పోర్టు పోరాటంలో కీలకంగా వ్యవహరించారు. మూడో కుమారుడు గోపాల్ అలియాస్ ఆజాద్ కూడా 2002లో మావోయిస్టు పార్టీ సభ్యుడిగా చేరి 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు సోమవారం తెల్లవారుజామున లక్ష్మణరావును విచారించారు. మావోయిస్టు కార్యకలాపాలు, ఇతర విషయాలపై ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే మానవ హక్కుల సంఘం సభ్యురాలు కె.సుధ ఇంట్లో కూడా ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. మావోయిస్టు భావజాలం, ఉద్యమ, విప్లవ పుస్తకాలు వంటి విషయాలపై తనిఖీలు చేసినట్లు సమాచారం. అదే విధంగా పీఎంపాలెం స్టేడియంలో వెనుక నివాసముంటున్న కుల నిర్మూలన పోరాట సమితి సభ్యుడు కురిటి పాపినాయుడు నివాసంలో కూడా అధికారులు తనిఖీ చేశారు. అయితే పాపినాయుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మావోలతో సంబంధం, విప్లవ, ఉద్యమాలకు సంబంధించిన ఆధారాల కోసం అన్వేషించినట్లు తెలుస్తోంది. మావోయిస్టు అనుబంధ సంఘాల నాయకులు మావోయిస్టులకు సహకరిస్తున్నట్లు ఆధారాలు ఉండడంతోనే సోదాలు చేసినట్లు ఎన్ఐఏ ప్రకటించింది.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు
- జగనన్నకు వందనం పేరిట వేడుకలు

మహారాణిపేట : దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి అవినీతి, వివక్షతకు తావివ్వకుండా పరిపాలన ప్రజలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హరెడ్డికే దక్కుతోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఏపీఎన్జీవో కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగనన్నకు వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కె.కె రాజు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ గ్రామ,వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పెన్షన్ కావాలన్నా..రేషన్ కార్డు కావాలన్నా.. ఇంటి పట్టాలు కావాలన్నా.. వైద్యం, ఆరోగ్యం ఇలాంటివెన్నో సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యను పరిష్కరించడం దేశంలో ఎక్కడా లేదన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ నిజం చేశారని కొనియాడారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అనిమిరెడ్డి రమణ, రాష్ట్ర కో–ఆర్డినేటర్ బి.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ బీవీ అశోక్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ మురళి, అనకాపల్లి ప్రెసిడెంట్ గణేష్ కుమార్ పాల్గొన్నారు.


జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కె.కె.రాజు. సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు

వైనాట్ వెంకట్రాయుడికి అవార్డు

తణుకు: రాష్ట్రంలో ఉత్తమ ఎలక్ట్రానిక్స్ అండ్ హోమ్ అప్లయన్సెస్ స్టోర్‌గా 2022–23 సంవత్సరానికి అవార్డు అందుకున్నట్లు తణుకు పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్ అధినేత జుజ్జవరపు వెంకట్రాయుడు తెలిపారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటి మెహ్రీన్ పిర్జాద చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఉభయగోదావరి జిల్లాలతోపాటు విశాఖపట్నంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాల అమ్మకాలు, విక్రయానంతర సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు ఈ అవార్డు అందుకున్నట్లు చెప్పారు.



నటి మెహ్రీన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట్రాయుడు దంపతులు

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

డాబాగార్డెన్స్: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) సిటీ బ్రాంచ్–1(671) ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 16వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎల్ మాట్లాడుతూ లియాఫీ సెక్రటరీ జనరల్‌గా 25 ఏళ్లపాటు సేవలందించిన నాగుమంత్రి గజపతిరావును అభినందించారు. సమాజంలో ఎల్ఐసీ ఏజెంట్లు నమ్మకమైన సేవలందిస్తున్నారని కొనియాడారు. లియాఫీ మాజీ సెక్రటరీ జనరల్ ఎన్.గజపతిరావు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల కీలక సమస్యలు ప్రధాన నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన జీవీఎల్ నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు. లియాఫీ ప్రస్తుత సెక్రటరీ జనరల్ బి. మార్కండేయలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 14 లక్షల మంది ఎల్ఐసీ ఏజెంట్లు పని చేస్తున్నారని, సమస్యలను సమష్టిగా పరిష్కరించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు తిరుమలరావు, వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌వీఆర్‌వీ రావు, కేవీ రమణ, పద్మనాభుడు, ఈశ్వరరావు, శివకుమార్, రామారావు, రవికుమార్, గురునాయుడు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి వివిధ బ్రాంచ్‌లకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.


గజపతిరావును సత్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

విశాఖ-గుణుపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ నౌపడ–పర్లాకిమిడి స్టేషన్ల మధ్య పవర్ బ్లాక్ తీసుకుంటున్నందుకు ఆయా తేదీల్లో విశాఖ -గుణుపూర్-విశాఖ పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు

➡ ఈ నెల 4,8,11,15,18,22,25 తేదీల్లో విశాఖ- గుణుపూర్- విశాఖ (08522/08521) పాసింజర్ స్పెషల్ ఇరుమార్గాల్లో రద్దు చేశారు.

గమ్యం కుదింపు.. : ఈ నెల 17,21,24,28,31 తేదీల్లో రూర్కెలా–గుణుపూర్(18117)రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ పలాస వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్–రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌గా ఈ నెల 18,22,25,29, నవంబరు 1వ తేదీలలో పలాస నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది. ఈ తేదీల్లో పలాస–గుణుపూర్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

మిల్లెట్స్‌తో మహాత్ముడి చిత్రం

బీచ్‌రోడ్డు: జాతిపిత మహాత్మాగాంధీ ఛాయాచిత్రాన్ని వినూత్నంగా రూపొందించారు నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. ఇటీవల కాలంలో మిల్లెట్స్‌తో ప్రముఖుల ఛాయాచిత్రాలను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని మహాత్ముడికి నివాళిగా సిరిధాన్యాలు, చార్కోల్ ఉపయోగించి గాంధీజీ నిలువెత్తు చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. దీనికోసం ఆయన వారం రోజులు శ్రమించారు. ఇటీవలే దేశంలో జరిగిన జీ20 సదస్సులలో విజయకుమార్ చిరుధాన్యాలతో చిత్రపటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విషయం తెలిసిందే.


మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన గాంధీ చిత్రంతో విజయ్‌కుమార్

టాప్‌బోర్డుకు వివాన్, హాన్య

- కంగుతున్న టోర్నీ టాపర్స్
- కొనసాగుతున్న ఫిడే రేటర్ల ఆధిక్యం

విశాఖ స్పోర్ట్స్: జాతీయ అండర్ 11 ఓపెన్ బాలికల చదరంగం చాంపియన్‌షిప్‌లో ఫిడే రేటింగ్ చిన్నారుల ఆధిక్యం కొనసాగుతోంది. పోర్ట్ స్టేడియంలో సోమవారం రెండు రౌండ్లలో పోటీలు జరిగాయి. టోర్నీ నాలుగో రౌండ్ ఓపెన్‌లో ఎఎఫ్ఎం పరంబ్రాతతో తలపడిన మాస్టర్ వివాన్ విజయం సాధించడంతో టాప్‌కు చేరుకున్నాడు. ఎఐఎం ఆదిక్ (1604) సైతం నాలుగో రౌండ్‌లో తనకంటే తక్కువ రేటింగ్ ఆటగాడు క్రిషయ్ (1435)చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో ఓపెన్ టాప్ 5లో వివాన్, నందన్ అన్ష్, సంజయ్, ఆయాన్, క్రిషయ్ నాలుగేసి పాయింట్లతో ఐదో రౌండ్‌కు అర్హతసాధించారు. టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన అపార్ మరో డ్రాతో మూడేసి పాయింట్లతో కొనసాగుతున్నాడు. బాలికల నాలుగో రౌండ్‌లో టోర్నీలో ఐదో రాంక్‌తో ప్రారంభించిన హన్య 4 పాయింట్లతో ఐదో రౌండ్‌లో టాప్ బోర్డుకు చేరుకుంది. ఎఎఫ్ఎం త్రిపురాంబిక నాలుగో రౌండ్‌లోనూ విజయంతో దూసుకెళ్లింది. మరో ఎఎఫ్ఎం మైషా (1386), జి.ఆధ్య (1274)ఎత్తులకు చిత్తై పరాజయం పాలయింది. హాన్య, ఆధ్యా, శరణ్య, వితస్త, ప్రతీతి నాలుగేసి పాయింట్లతో టాప్5లో ఐదో రౌండ్ ఆడనున్నారు. ఆముక్త నాలుగో రౌండ్‌లో విజయంతో మూడున్నర పాయింట్లతో కొనసాగుతోంది. అపార్, ఆముక్త డ్రా చేసుకోవడంతో టాపర్ ర్యాంక్‌ను కోల్పోయి వెనుకబడ్డారు. ఆంధ్ర చెస్, ఆల్ విశాఖ చదరంగం సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 11 రౌండ్ల పాటు ఈ పోటీలు జరగనున్నాయి.

మూడోరౌండ్‌లో...

ఉదయం జరిగిన మూడో రౌండ్ బాలికల్లో టాప్ సీడ్ ఆముక్త (ఏపీ) హర్యానాకు చెందిన ఆహ్నాతో 49వ మూవ్‌లో డ్రా చేసుకోవడంతో వెనుకబడింది. ఎరీనా ఫిడే మాస్టర్లు (ఎఎఫ్ఎం) మైషా (మహారాష్ట్ర) త్రిపురాంబిక (ఏపీ)తోపాటు ఏపీకే చెందిన భావన్య విజయాలతో మూడోరౌండ్ ముగించారు. వీరితో పాటు సిద్ధి, దివ్య, ప్రతీతి, శ్రేయాలో టాప్–5లో నిలిచి నాలుగో రౌండ్‌కు చేరుకున్నారు. ఓపెన్‌లో టాప్ సీడ్ అపార్ మూడో రౌండ్‌లో విజయం సాధించినా రెండో రౌండ్లో డ్రాతో వెనుకబడ్డాడు. మాస్టర్ వివాన్ (గుజరాత్) ఆడిన 3 రౌండ్లలోనూ విజయంతో టాప్ బోర్డ్‌పై 4వ రౌండ్ ఆడాడు. ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్ కేరళకు చెందిన ఆదిక్‌తో పాటు ఆయాన్, వ్యోమ్, మెహుల్ టాప్ 5 నిలివగా, ఎఎఫ్ఎం పరంబ్రాతా విజ యంతో మూడు పాయింట్లు సాధించారు. వీరితో టోర్నీ మూడో ర్యాంకర్ అంశ్ (మహారాష్ట్ర), అఖిల్ (ఏపీ), దివిత్ (తెలంగాణ) సైతం ఆడిన మూడు రౌండ్లలో విజయంతో నాలుగో రౌండ్‌కు చేరుకున్నారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఇద్దరు యువకులు కొట్టుకుపోతుండగా లైఫ్ గార్డ్స్ కాపాడారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ప్రకాష్, జన సోమవారం సాయంత్రం బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి వీరిద్దరూ కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ వీరిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని ఇంటికి పంపించారు.

క్రికెట్ కోచ్ రహంతుల్లా మృతికి సంతాపం

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ కోచ్ రహంతుల్లా మృతికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సంతాపం వ్యక్తం చేసింది. కోచ్‌గా ఆరు దశాబ్దాల పాటు సేవలందించారని, నేటి తరానికి స్ఫూర్తి అని కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి అన్నారు. మేటి క్రికెటర్లకు ఆయన శిక్షణ నిచ్చారని గుర్తు చేసుకున్నారు.